
సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

మంగళవారం । 27 । జూన్ । 2023



అన్నదాన ట్రస్టుకు విరాళం

ఐ.పోలవరం: మురమళ్ల శ్రీ వీరేశ్వర స్వామి నిత్యాన్నదాన ట్రస్టుకు బొడ్డపాటి సుబ్రహ్మణ్య శాస్త్రి దంపతులు (హైదరాబాద్) సోమవారం రూ.10,120 విరాళాన్ని ఈఓకు అందజేశారు.



డెల్టాలకు నీటి విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం తూర్పు డెల్టాకు 1,590, మధ్య డెల్టాకు 1,140, పశ్చిమ డెల్టాకు 3,000 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేశారు.

గరిష్టం/కనిష్టం
33.0°/24.0°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	32.5	24.0
కాకినాడ	33.0	24.5
అమలాపురం	32.0	26.0

న్యూస్‌రీల్

పాఠశాలకు రూ.2.20 లక్షల విరాళం



పాఠశాలకు విరాళం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

పి.గన్నవరం: స్థానిక శింగంశెట్టి ప్రభావతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాలకు సోమవారం రూ.2.2౦ లక్షల విరాళం అందజేశారు. ఈ సొమ్మును డిపాజిట్ చేసి, దానిపై వచ్చే వడ్డీతో ఏటా పదో తరగతి పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించాలని ప్రధానోపాధ్యాయుడు డీఎస్‌వీ ప్రసాద్‌ను వారు కోరారు. విరాళం అందించిన 1983–84 బ్యాచ్ విద్యార్థులు మానేపల్లి వెంకటేశ్వరరావు, చింతపల్లి సుజాత (జీహెచ్‌ఎం), పాకా వలంటీనా, యర్రంశెట్టి సూరిబాబు, అడబాల అలివేలు, ఒరిగొండ పద్మావతి, అయ్యగారి కమల తదితరులను పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ గూటం శ్రీనివాసరావు, హెచ్‌ఎం ప్రసాద్ అభినందించారు.

జాతీయ పెంటాథ్లాన్ పోటీలకు ఏడుగురి ఎంపిక



జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం అరుణ తదితరులు

తాళ్లరేవు: వచ్చే నెలలో గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగే జాతీయ స్థాయి మోడరన్ పెంటాథ్లాన్ లేజర్ రన్ పోటీలకు తాళ్లరేవుకు చెందిన ఏడుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఏపీ అంతర జిల్లాల మోడరన్ పెంటాథ్లాన్ లేజర్ రన్ ఛాంపియన్‌షిప్–2023 పోటీలు ఇటీవల రెండు రోజుల పాటు కాకినాడలో జరిగాయి. వీటిలో జార్జీపేట ఎంఎల్‌కే నగర్ సెయింట్ జోసెఫ్స్ హైస్కూల్ విద్యార్థులు 17 మంది పాల్గొన్నారు. వీరిలో అండర్–17 విభాగం నుంచి పి.అమృత, ఎస్.అలేఖ్య, ఎం.శ్యామల, జె.చైతన్య, అండర్–13 నుంచి పి.లక్షిత్, పి.సాత్విక్, అండర్–11 విభాగం నుంచి పి.రాజ్‌కుమార్ అత్యుత్తమ ప్రతిభ కనబరచి జాతీయ స్థాయికి ఎంపికయ్యారని స్కూల్ హెచ్‌ఎం సిస్టర్ అరుణ తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన పీఈటీ సూర్యాపాల్‌ను పాఠశాల ప్రాంగణంలో సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం అరుణ మాట్లాడుతూ, తమ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించడం ఆనందంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ మేరీ గ్రేస్, ఉపాధ్యాయినులు శ్యామల, మరియారాణి, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

ప్రతాప్‌కు 'కవిశ్రేష్ఠ' అవార్డు ప్రదానం



కవిశ్రేష్ఠ అవార్డు అందుకుంటున్న ప్రతాప్

సఖినేటిపల్లి: మండలానికి చెందిన శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్‌కు కన్నడ సాహిత్య సంస్థలు 'కవిశ్రేష్ఠ' అవార్డు ప్రదానం చేశాయి. జాతీయ స్థాయిలో ఆయన చేస్తున్న సాహిత్య సేవలను గుర్తించి, ఈ అవార్డు అందించాయి. కర్నాటకలోని మైసూర్‌లో సోమవారం కన్నడ, తెలుగు కవితా గోష్టి జరిగింది. దీనిని మైసూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ హాలులో మైసూర్ సాహిత్య దాసోహ, హోయసల కన్నడ సంఘం, సవిగన్నడ పత్రిక బళగ, కన్నడ పరిషత్ సంయుక్తంగా నిర్వహించాయి. తెలుగు సంస్కృతి, తెలుగు, కన్నడ సంప్రదాయాలు, భాషా సంరక్షణ, కవితా నేపథ్యం అనే అంశాలపై డాక్టర్ ప్రతాప్ ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ఈ వివరాలను ఈ–మెయిల్ ద్వారా ప్రతాప్ స్థానిక విలేకర్లకు తెలిపారు.

సంచుల సరఫరాకు టెండర్లు

ముమ్మిడివరం: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బలవర్ధక పోషకాహారం పంపిణీ చేసేందుకు అవసరమైన సంచుల సరఫరాకు టెండర్లు ఆహ్వానిస్తున్నారు. జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ అభివృద్ధి, సాధికారిక అధికారి జీవీ సత్యవాణి సోమవారం ఈ విషయం తెలిపారు. మొత్తం 18,400 సంచుల సరఫరాకు టెండర్లు పిలుస్తున్నామన్నారు. జిల్లా స్త్రీ, శిశు అభివృద్ధి సాధికారత అధికారి పేరిట రూ.1,000 డీడీ చెల్లించి, ఈ నెల 30 లోపు టెండర్ ఫాం తీసుకుని, వచ్చే నెల ఒకటో తేదీ సాయంత్రం 4 గంటలలోపు సమర్పించాలని ఆమె సూచించారు.

కౌలు రైతులకు కొండంత అండగా..



దమ్ము చేస్తున్న కౌలు రైతు

- వారికి పూచీకత్తు లేకుండా రుణాలు
- జిల్లాలో తొలి దశలో 403 మంది ఎంపిక
- వారిలో 323 మందికి నేడు పంపిణీ
- కొత్తపేట మండలం అవిడిలో లాంఛనంగా ఆరంభం
- రూ.1.40 కోట్ల రుణాలిచ్చేందుకు ప్రతిపాదనలు
- కౌలుదారుల గ్రూపులకు సైతం రుణాలు
- జిల్లాలో 38 గ్రూపుల ద్వారా 526 మందికి లబ్ధి

సాక్షి, అమలాపురం: కౌలు రైతులకు అన్నీ కష్టాలే. సాగు చేసేందుకే కాదు.. బ్యాంకుల నుంచి రుణాలు పొందేందుకు సైతం వారు అష్టకష్టాలు పడాల్సిందే. సాగు హక్కు పత్రం (క్రాప్ కల్టివేషన్ రైట్ సర్టిఫికెట్ – సీసీఆర్‌సీ) వచ్చేందుకు చాలా చోట్ల భూమి యజమానులు అంగీకరించరు. ఒకవేళ అంగీకరించి, కార్డులు వచ్చేటట్టు చేసినా రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు పెద్దగా ఆసక్తి చూపవు.

దీనివల్ల ప్రతి సీజన్‌లోనూ కౌలు రైతులు సకాలంలో పంట రుణాలందక వడ్డీ వ్యాపారులను, మధ్య దళారీలను ఆశ్రయించి, ఆర్థికంగా నష్టపోతున్నారు. జిల్లాలో గత ఏడాది 56,032 మందికి సీసీఆర్‌సీ ఉండగా 3,836 మందికి మాత్రమే రుణాలందాయి.

ఈ నేపథ్యంలో కౌలు రైతుల కష్టాలను గుర్తించిన ప్రభుత్వ యంత్రాంగం వారికి అండగా నిలవాలని నిర్ణయించింది. వారికి వ్యక్తిగతంగాను, గ్రూపులు ఏర్పాటు చేసి రుణాలివ్వాలని నిర్ణయించింది. దీనిపై కలెక్టర్ హిమాన్షు శుక్లా ప్రత్యేక శ్రద్ధ తీసుకుని జిల్లాను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన విషయం తెలిసిందే. తొలి విడతగా పది మండలాల్లో పది గ్రామాలను ఎంపిక చేశారు. కౌలుదారులకు ఇచ్చే రుణాలను ప్రస్తుతం వరి సాగు చేసే వారికే పరిమితం చేశారు.

ఈ ఏడాది 2 వేల మందికి వ్యక్తిగత రుణాలివ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. వీరికి రుణాలిచ్చేందుకు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) ముందుకు వచ్చింది. ఇప్పటి వరకూ 403 మంది అర్హులను గుర్తించారు. వీరికి రూ.1,40,58,100 రుణంగా అందించనున్నారు. వీరిలో 323 మందికి కొత్తపేట మండలం అవిడిలో మంగళవారం రుణాలందించనున్నారు.

వ్యక్తిగత రుణాలకు కౌలుదారుల ఎంపిక ఇలా..

మండలం	గ్రామం	అర్హులైన రైతులు	గుర్తించిన రైతులు
అయినవిల్లి	పోతుకుర్రు	50	32
పి.గన్నవరం	ఉడుమూడి	70	60
అంబాజీపేట	గంగలకుర్రు	50	35
మలికిపురం	లక్కవరం	40	26
కొత్తపేట	అవిడి	80	65
రావులపాలెం	రావులపాడు	80	55
ముమ్మిడివరం	చిన కొత్తలంక	40	20
అల్లవరం	కోడూరుపాడు	40	33
రాజోలు	చింతపల్లి	40	35
మామిడికుదురు	గెద్దాడ	50	42
	మొత్తం	540	403

గ్రూపులకు సైతం..

కౌలుదారులను గ్రూపులుగా ఏర్పాటు చేసి రుణాలందించనున్నారు. జిల్లాలోని రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో 38 గ్రూపులు ఏర్పాటు చేసి, 526 మందికి రుణాలిచ్చేందుకు జిల్లా యంత్రాంగం ప్రణాళిక సిద్ధం చేసింది.

మండలం	గ్రామం	రైతు గ్రూపులు	గ్రూపులో సభ్యులు
కె.గంగవరం	దంగేరు	6	100
కపిలేశ్వరపురం	టేకి	19	102
మండపేట	మారేడుబాక	4	102
రాయవరం	మాచవరం	5	112
రామచంద్రపురం	ఏరుపల్లి	4	110
	మొత్తం	38	526

సాగు విస్తీర్ణం ఆధారంగా..

ఒక్కో కౌలు రైతుకు పంట సాగు విస్తీర్ణాన్ని బట్టి రూ.లక్ష వరకూ రుణంగా అందించనున్నారు. దీనిపై 12 శాతం వడ్డీ వసూలు చేస్తారు. అలాగే ఐదు కౌలుదార్ల గ్రూపులు ఎంపిక చేసి, వాటి ద్వారా 526 మందికి రుణాలివ్వాలని నిర్ణయించారు.

రుణాల పంపిణీకి సంబంధించి తుది కసరత్తు జరుగుతోంది. కౌలు రైతులు సకాలంలో పంట రుణాలు పొందేందుకు కేవలం గ్రామ వ్యవసాయ అధికారి, గ్రామ రెవెన్యూ అధికారి ధ్రువీకరణ ఆధారంగా ఎటువంటి పూచీకత్తూ లేకుండా వ్యవసాయ, వృత్తి రుణాలు అందిస్తారు.

ష్యూరిటీ లేకుండా రుణాలివ్వడం సంతోషం



ష్యూరిటీ లేకుండా రుణాలివ్వడం వల్ల మావంటి నిరుపేద కౌలు రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. కౌలుదారుల్లో చాలా మందిమి రుణ అర్హత కార్డులు లేక ఇబ్బంది పడుతున్నాం. ఈ సమయంలో ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల మాకు అధికంగా మేలు జరుగుతుంది.

– సానబోయిన యేసుబాబు, కౌలు రైతు, గంగలకుర్రు, అంబాజీపేట మండలం

ప్రభుత్వం మేలు చేస్తోంది



గతంలో ఏ ప్రభుత్వమై కౌలుదార్లను ఈ రకంగా ఆదుకోలేదు. వ్యక్తిగత రుణాలివ్వడం ద్వారా మమ్మల్ని ఉద్యోగులుగా, వ్యాపారులుగా గుర్తించడం సంతోషం. రైతు సంక్షేమం కోరే ఇటువంటి ప్రభుత్వాలు ఉండాలని మాలాంటి కౌలు రైతులు కోరుకుంటున్నారు.

– చిట్టూరి ప్రసాద్, పురేటివారి చెరువు, రావులపాడు, రావులపాలెం మండలం

గ్రూపుల ఏర్పాటు మంచి నిర్ణయం



కౌలుదారులకు గ్రూపులు ఏర్పాటు చేసి రుణాలివ్వాలనే నిర్ణయం చాలా మంచిది. జేఎల్‌జీ, ఆర్‌ఎంజీ గ్రూపులు ఏర్పాటు చేసి రుణాలిస్తున్నా అందరికీ అందడం లేదు. ఇప్పుడు గ్రూపులోని ప్రతి కౌలుదారుకూ రుణం అందుతోంది.

– పలివెల వెంకట రమణ, శ్రీరామ అగ్రికల్చర్ ప్రొఫెషనల్ గ్రూప్, దంగేరు, కె.గంగవరం మండలం

విజయవంతం చేయాల్సింది కౌలుదారులే..



కౌలుదారులకు మేలు చేసేందుకు జిల్లాను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి వ్యక్తిగత రుణాలివ్వాలని నిర్ణయించాం. ఈ విధానాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత వారి మీదనే ఉంది. రైతులు సకాలంలో రుణాలు చెల్లించాలి. ఇక్కడ విజయవంతమైతే దీనిని రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసే అవకాశముంది.

– హిమాన్షు శుక్లా, జిల్లా కలెక్టర్

యువ న్యాయవాదుల మేలుకే లా నేస్తం

- కలెక్టర్ హిమాన్షు శుక్లా
- 35 మంది లాయర్లకు ఆర్థిక తోడ్పాటు



సీఎం వర్చువల్ సమావేశాన్ని న్యాయవాదులతో కలిసి వీక్షిస్తున్న కలెక్టర్ శుక్లా

సాక్షి, అమలాపురం: న్యాయవాద వృత్తిలో ప్రవేశించే యువ న్యాయవాదులకు మూడేళ్ల పాటు ప్రతి నెలా రూ.5 వేల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం సాయం అందిస్తోందని కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. యువ న్యాయవాదులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి విడత వైఎస్సార్ లా నేస్తం నిధులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం అమరావతి నుంచి వర్చువల్ విధానంలో బటన్ నొక్కి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ నుంచి కలెక్టర్ శుక్లాతో పాటు లబ్ధిదారులైన న్యాయవాదులు పాల్గొన్నారు. కలెక్టర్ శుక్లా మాట్లాడుతూ, జిల్లాలో 35 మంది యువ న్యాయవాదులకు రూ.5 వేల చొప్పున ప్రభుత్వం జమ చేసిందని చెప్పారు. ఈ విధంగా వారికి ప్రతి నెలా రూ.1.80 లక్షల మేర ఆర్థిక సాయం అందిస్తోందన్నారు. ఈ నిధులను సద్వినియోగం చేసుకొని, యువ న్యాయవాదులు పెద్ద స్థాయికి చేరుకొని పేదలకు న్యాయ సహాయం అందించాలనే ఆశయంతో ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశ పెట్టిందని చెప్పారు. న్యాయవాదుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.100 కోట్లతో ఫండ్ ఏర్పాటు చేసిందని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు ఆర్.శ్రీనివాసరావు భాస్కరశాస్త్రి, జి.రాంబాబు, జూనియర్ న్యాయవాదులు జి.గీత, ఎం.భార్గవి, కేసరి లీలాదేవి, జి.నాగకుమారి జి.రాజేంద్ర, కలెక్టరేట్ సెక్షన్ అధికారి పి.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

యువతతోనే డ్రగ్స్ రహిత సమాజం

- జిల్లా ఎస్పీ శ్రీధర్
- అమలాపురంలో మాదక ద్రవ్యాల వ్యతిరేక ర్యాలీ
- వేలాదిగా పాల్గొన్న విద్యార్థులు
- డ్రగ్స్‌కు దూరంగా ఉంటామని సామూహిక ప్రతిజ్ఞ



డ్రగ్స్ రహిత సమాజం కోసం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్పీ శ్రీధర్, ఏఎస్పీ ఖాదర్ బాషా, ఎస్‌ఈబీ అధికారులు



ర్యాలీలో వేలాదిగా పాల్గొన్న విద్యార్థులు

అమలాపురం టౌన్: మత్తుతో జీవితాలను చిత్తు చేసే డ్రగ్స్ పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని, వారితోనే డ్రగ్స్ రహిత సమాజం సాధ్యమని జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్ అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అమలాపురంలో సోమవారం నిర్వహించిన ర్యాలీని ఆయన స్థానిక ఎస్‌కేబీఆర్ కళాశాల వద్ద జెండా ఊపి ప్రారంభించారు. పట్టణంలోని వివిధ కళాశాలలకు చెందిన వేలాది మంది విద్యార్థులు ఈ ర్యాలీలో పాల్గొని డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. 216 జాతీయ రహదారి మీదుగా ఎస్‌కేబీఆర్ కళాశాల నుంచి సుబ్బారాయుడు చెరువు సెంటర్, గోఖలే సెంటర్, హైస్కూలు రోడ్డు మీదుగా గడియారం స్తంభం సెంటర్ వరకూ ఈ ర్యాలీ రెండు కిలోమీటర్ల మేర సాగింది. జిల్లా ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ) జాయింట్ డైరెక్టర్ ఎం.జయరాజ్, డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సీహెచ్ భారతలక్ష్మి, ఏఆర్ డీఎస్పీ పి.పార్థసారథి తదితర పోలీసు అధికారులు ఈ ర్యాలీలో పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా గడియారం స్తంభం సెంటర్‌లో జరిగిన సభలో ఎస్పీ శ్రీధర్ మాట్లాడారు. డ్రగ్స్‌కు దూరంగా ఉంటామని, ఎట్టి పరిస్థితుల్లోనూ దానికి బానిసలు కాబోమని అందరూ తనకు మాట ఇవ్వాలని కోరారు. దీనికి స్పందించిన విద్యార్థులు విద్యార్థులు డ్రగ్స్‌ను దరి చేరనీయబోమని ఏక కంఠంతో నినదించారు. డ్రగ్స్ రహిత సమాజాన్ని ఆవిష్కరిస్తామని విద్యార్థులతో ఎస్పీ శ్రీధర్ సామూహికంగా ప్రతిజ్ఞ చేయించారు. ఏఎస్పీ, ఎస్‌ఈబీ జిల్లా ఇన్‌చార్జి ఖాదర్ బాషా మాట్లాడుతూ, డ్రగ్స్ వల్ల ఆరోగ్యం ఎలా చెడిపోతుందో, జీవితాలు ఎలా చిత్తవుతాయో, డ్రగ్స్ కేసుల్లో ఇరుక్కుంటే శిక్షలు ఎంతటి తీవ్రంగా ఉంటాయో వివరించారు. డ్రగ్స్‌ను దూరం పెట్టే అంశంపై డీఎస్పీ అంబికా ప్రసాద్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అమలాపురం పట్టణ, రూరల్ సీఐలు డి.దుర్గాశేఖరరెడ్డి, పి.వీరబాబుతో పాటు పలువురు ఎస్సైలు, ఎన్‌సీసీ, ఎస్ఎస్ఎస్ విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

పేరూరులో రుణాల స్వాహాపై సీరియస్

- విచారణకు కలెక్టర్ ఆదేశం
- బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్పష్టీకరణ



మహిళా సంఘాలను విచారిస్తున్న డీఆర్‌డీఏ పీడీ శివశంకర్ ప్రసాద్

అమలాపురం రూరల్: పేరూరులో డ్వాక్రా సంఘాల సభ్యులు చెల్లించిన రుణ వాయిదాల సొమ్మును విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్ (వీఓఏ) నెల్లి కనకదుర్గ స్వాహా చేసిన ఘటనపై కలెక్టర్ హిమాన్షు శుక్లా సీరియస్ అయ్యారు. ఈ వ్యవహారంపై పూర్తి స్థాయి విచారణ చేపట్టి, సంబంధిత ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీఏ అధికారులను ఆదేశించారు. బాధ్యురాలైన వీఓఏపై కేసులు నమోదు చేయాలని జిల్లా ఎస్పీకి సూచించారు. పేరూరులో 38 డ్వాక్రా సంఘాలకు సంబంధించిన స్త్రీనిధి, బ్యాంక్ రుణాలు పొందిన సభ్యులు చెల్లించిన వాయిదాల సొమ్మును వీఓఏ కనకదుర్గ స్వాహా చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో బాధితులు సోమవారం స్పందనలో కలెక్టర్ శుక్లాకు వినతిపత్రం అందించి, తమకు న్యాయం చేయాలని మొర పెట్టుకున్నారు. దీనిపై స్పందించిన కలెక్టర్ ఈ అవినీతిపై డీఆర్‌డీఏ పీడీ శివశంకర ప్రసాద్‌ను ఆరా తీశారు. వీఓఏగా పని చేస్తున్న కనకదుర్గ కొంకాపల్లిలో యూనియన్ బ్యాంకు వినియోగదారుల సేవ కేంద్రం (సీఎస్‌పీ) బీసీ పాయింట్‌ను నిర్వహించేదని, ఏడాది కిందట ఆ పాయింట్ మూసివేసినప్పటికీ సభ్యులతో బ్యాంకు రుణ వాయిదాలు కట్టించుకున్నట్టు నకిలీ రశీదులు ఇచ్చి మోసం చేసిందని కలెక్టర్‌కు పీడీ వివరించారు. ఈ అవినీతిలో బ్యాంక్ అధికారుల పాత్రపై కూడా అనుమానాలు వ్యక్తం చేశారు. దీంతో ఈ వ్యవహారంపై పూర్తి విచారణ చేపట్టి, సంబంధిత ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కాగా, బాధితులు జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్‌కు కూడా పోలీసు స్పందనలో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో డ్వాక్రా సంఘాల సభ్యులను మోసం చేసి, వాయిదాల సొమ్ము కాజేసిన వారిపై క్రిమినల్ కేసుల నమోదుకు పోలీసులు సన్నద్ధమవుతున్నారు.

బ్యాంకులో విచారణ

కలెక్టర్ ఆదేశాల నేపథ్యంలో డీఆర్‌డీఏ అధికారులు జిలాని, డీపీఎంలు అన్నపూర్ణ, విజయ్ కుమార్, ఏపీఎం రమణి, పలువురు అధికారులు రుణాలు ఇచ్చిన కొంకాపల్లి యూనియన్ బ్యాంక్ బ్రాంచికి వెళ్లారు. రుణాల జాబితాతో పేరూరు చేరుకున్నారు. స్త్రీనిధి బ్యాంకు ద్వారా డ్వాక్రా గ్రూపు సభ్యులు ఎన్ని లక్షల రూపాయల రుణాలు తీసుకున్నారు, ఎన్ని వాయిదాలు చెల్లించారు, బ్యాంక్ లింకేజీ ద్వారా ఎన్ని లక్షల రూపాయల రుణాలు పొందారు, ఎన్ని వాయిదాలు కట్టారు అనే విషయాలపై క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. విచారణ జరుగుతోందని, లెక్కలు తేలాల్సి ఉందని అధికారులు తెలిపారు. వీఓఏ కనకదుర్గ ఎంత స్వాహా చేసింది, ఆమె వెనుక ఇంకా ఎవరెవరున్నారనే అంశాలపై ఆరా తీస్తున్నారు. గతంలో ఆత్రేయపురంలో ఇదే తరహా సంఘటన జరిగినప్పుడు అక్కడి సీసీని విధుల నుంచి తప్పించామని డీఆర్‌డీఏ పీడీ శివశంకర్ ప్రసాద్ చెప్పారు. బండారులంకలో జరిగిన రుణాల అవినీతికి సంబంధించి ఆ క్లస్టర్ సీసీపై చర్యలకు జిల్లా సమాఖ్యకు ఆదేశించారని తెలిపారు. పేరూరులో జరిగిన అక్రమాలపై కూడా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.


జగనన్న సురక్షను వేగవంతం చేయాలి

సాక్షి, అమలాపురం: జగనన్న సురక్ష కార్యక్రమం సర్వేను వేగవంతం చేసి, ఎప్పటికప్పుడు టోకెన్లు జనరేట్ చేస్తూ, సర్వీస్ రిక్వెస్టులు ఆన్‌లైన్ చేయాలని ఎంపీడీఓలు, తహసీల్దార్లను కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశించారు. డివిజన్, మండల స్థాయి అధికారులతో ఆయన సోమవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జగనన్న సురక్ష కార్యక్రమం, ప్రాధాన్య భవనాల నిర్మాణం, వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష, రీసర్వే, గడప గడపకూ మన ప్రభుత్వం, ఉపాధి హామీ పథకం అనుసంధానంతో ఉద్యాన సాగు, గృహ నిర్మాణం, కౌలు రైతులకు పంట రుణ అర్హత కార్డుల మంజూరు వంటి అంశాల పురోగతిపై సమీక్షించారు. రీ సర్వేకు సంబంధించిన అన్ని ప్రక్రియలూ సమాంతరంగా చేపడుతూ రోజు, వారం, నెలవారీ నివేదికలు ఎప్పటికప్పుడు సమర్పించాలని ఆదేశించారు. జిల్లాకు 55 వేల పంట రుణ అర్హత కార్డులు లక్ష్యంగా నిర్దేశించామని, వీటిని అర్హులందరికీ అందజేసి, పంట రుణాలు అందేలా చేయూతనందించాలని సూచించారు. ప్రభుత్వ ప్రాధాన్య భవనాలైనా గ్రామ సచివాలయ నిర్మాణాలు జిల్లాలో 400 వరకూ పునాది స్థాయి దాటి నిర్మాణంలో ఉన్నాయని, వీటిని సెప్టెంబర్ 15 లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో 256 రైతుభరోసా కేంద్రాల భవన నిర్మాణాలు పునాది స్థాయిని దాటాయని, వీటిని కూడా సెప్టెంబర్ నెలాఖరుకు పూర్తి చేయాలని కలెక్టర్ చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర, డీఆర్‌ఓ సీహెచ్ సత్తిబాబు కూడా పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎలక్ట్రికల్ షాపులో అగ్ని ప్రమాదం

రూ.40 లక్షల నష్టం



షాపులో పూర్తిగా దగ్ధమైన సామగ్రి

నిడదవోలు: పట్టణంలో ఓ ఎలక్ట్రికల్ షాపు దగ్ధమైన ఘటనలో రూ.40 లక్షల ఆస్తినష్టం వాటిల్లింది. స్థానిక గణేష్ చౌక్ సెంటర్‌లో గోదావరి ఎలక్ట్రికల్ షాపును గాంచి శంకర్‌లాల్ నిర్వహిస్తున్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఆదివారం అర్ధరాత్రి షాపులో మంటలు చెలరేగాయి. షాపు పూర్తిగా దగ్ధమైంది. అందులోని ఎలక్ట్రికల్ సామగ్రితో పాటు ఫర్నిచర్, ప్లంబింగ్ సామగ్రి పూర్తిగా కాలి బూడిదయ్యాయి. నిడదవోలు అగ్నిమాపక అధికారి శ్రీనివాసరావు తన సిబ్బందితో ప్రమాద స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.


విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

కొత్తపల్లి: విద్యుదాఘాతంతో సోమవారం ఒక వ్యక్తి మృతి చెందాడు. ఇన్‌చార్జి ఎస్సై సత్యనారాయణ కథనం ప్రకారం.. కొండెవరం గ్రామానికి చెందిన రాయుడు చంద్రరావు (43) చింత చెట్టు సెంటర్‌లో టీ కొట్టు నిర్వహించుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఉదయం వ్యాపారం నిర్వహిస్తున్న సమయంలో మోటారు నుంచి నీరు రాలేదు. దీంతో ఏమైందో చూడటానికి మోటార్‌ను తాకడంతో ఒక్కసారిగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతడిని బంధువులు పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. మృతుడు చంద్రరావుకు భార్య నాగలక్ష్మి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహానికి పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

బుక్.. అదుర్స్



ఇంగ్లిష్, తెలుగు భాషల్లో ముద్రించిన పాఠ్యాంశాలు



ఆకట్టుకునేలా ఉన్న పాఠ్య పుస్తకాలు

- నాణ్యమైన రంగులు, హంగులతో పుస్తకాల ముద్రణ
- సర్కారీ పాఠశాలల విద్యార్థుల్లో వెల్లివిరుస్తున్న ఆనందం
- 31.73 లక్షల సెమిస్టర్-1 పాఠ్య పుస్తకాల పంపిణీ

జిల్లాల వారీగా సెమిస్టర్-1 పాఠ్య పుస్తకాల పంపిణీ ఇలా..

జిల్లా	పాఠ్య పుస్తకాలు	వర్క్ బుక్స్	మొత్తం	పంపిణీ	శాతం
తూర్పు గోదావరి	5,63,607	1,15,176	6,78,783	6,78,783	100
కాకినాడ	12,10,436	2,47,163	14,57,599	14,57,599	100
కోనసీమ	8,53,289	1,83,677	10,36,966	10,36,966	100

రాయవరం: బడి గంట గణగణమంటూ మోగింది. పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. సోమవారం నుంచి పూర్తి స్థాయిలో రెండు పూటలా పని చేస్తున్నాయి. విద్యా సంవత్సరం తొలి రోజునే నూతన పాఠ్య పుస్తకాలను ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అందజేశారు. నాణ్యమైన కాగితం, అయిల్ ప్రింట్‌తో ఈసారి పంపిణీ చేసిన పాఠ్య పుస్తకాల ముద్రణ ఎంతో ఆకట్టుకుంటోంది.

కొత్తకొత్తగా..

పాఠశాలల్లో మన బడి నాడు–నేడు, జగనన్న విద్యా కానుక, అమ్మ ఒడి, జగనన్న గోరుముద్ద, 3–10 తరగతుల విద్యార్థులకు సబ్జెక్టు టీచర్లతో బోధన, 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ, ఇంగ్లిషు మాధ్యమంలో బోధన, డిజిటల్ చదువులు.. ఇలా పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. విద్యార్థులకు నాణ్యమైన, గుణాత్మకమైన విద్యను అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా వ్యవస్థలో విప్లవాత్మక సంస్కరణలు ప్రవేశపెట్టారు. వీటితో పాటు నూతన పాఠ్య పుస్తకాలను కొత్త హంగులతో, నాణ్యతతో తయారు చేసి, విద్యార్థులకు పంపిణీ చేశారు. ఆకట్టుకునే చిత్రాలు, అందమైన కవర్ పేజీలతో రూపొందించిన ఈ పుస్తకాలను విద్యార్థులు మురిపెంగా చూసుకుంటూ మురిసిపోతున్నారు. వారిలో నూతనోత్సాహం కనిపిస్తోంది.

పుస్తకాలకు కోడింగ్ నంబర్లు

విద్యార్థులకు పుస్తకాల పంపిణీని పాఠశాల విద్యాశాఖ ఈ ఏడాది పకడ్బందీగా చేపట్టింది. సబ్జెక్టుల వారీగా, సెమిస్టర్ల వారీగా పుస్తకాలను అందజేశారు. పుస్తకాలు దుర్వినియోగం కాకుండా పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ఆధారంగా పంపిణీ చేశారు.

చిత్రాలు, రంగులతో కొత్తరూపు

ప్రభుత్వం పంపిణీ చేసిన పుస్తకాల ముద్రణ, నాణ్యత నభూతో.. అన్న రీతిలో ఉన్నాయి. చూడగానే విద్యార్థులను ఆకట్టుకునేలా చిత్రాలు, టేబుల్స్, రంగులతో నిండి ఉన్నాయి. ప్రాథమిక స్థాయి విద్యార్థులకు పెద్ద పెద్ద బొమ్మలను విభిన్న రంగుల్లో ఆకట్టుకునేలా వేసి, నాణ్యమైన కాగితాలపై ముద్రించారు. కవర్ పేజీతో పాటుగా లోపలి పేజీలు కూడా పాఠ్యాంశాల వారీగా అందంగా కనిపిస్తున్నాయి. పెద్ద తరగతుల వారికి కూడా ఆయా సబ్జెక్టు పుస్తకాల్లో క్యూఆర్ కోడ్‌తో కూడిన వీడియో వివరణలను అందుబాటులో ఉంచారు. పుస్తకంలో ఇచ్చిన క్యూఆర్ కోడ్‌ను మొబైల్ ఫోన్ ద్వారా స్కాన్ చేసిన వెంటనే సంబంధిత విషయానికి సంబంధించిన అదనపు సమాచారంతో కూడిన వీడియోలు అందుబాటులోకి వచ్చేలా విద్యా శాఖ ఏర్పాట్లు చేసింది. దీంతో గ్రామీణ ప్రాంత విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు సైతం కొత్త పాఠ్య పుస్తకాలపై ఎక్కడ లేని ఆసక్తి చూపుతున్నారు.

తరగతుల వారీగా పాఠ్య పుస్తకాల టైటిల్స్

తరగతులు	టైటిల్స్
1, 2	8
3, 4, 5	12
6, 7	11
8	14
9	17
10	08

తల్లిదండ్రులపై భారం తగ్గించేందుకు..

విద్యార్థుల తల్లిదండ్రులపై భారం తగ్గించేందుకు ప్రభుత్వం పాఠ్య పుస్తకాలను సెమిస్టర్ల వారీగా ముద్రించింది. గత ఏడాది మూడేసి సెమిస్టర్లుగా ముద్రించగా, ఈ ఏడాది రెండు సెమిస్టర్లకు కుదించారు. దీనివలన టైటిల్స్ సంఖ్య కూడా తగ్గింది. ప్రస్తుతం 1–10 తరగతులకు లాంగ్వేజ్, నాన్ లాంగ్వేజ్ కలిపి 113 టైటిల్స్ ముద్రించారు. తూర్పు గోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో 26,27,332 పాఠ్య పుస్తకాలు, 5,46,016 వర్క్‌బుక్స్ కలిపి మొత్తం 31,73,348 పుస్తకాలను సెమిస్టర్–1లో పంపిణీ చేశారు. సెమిస్టర్–2 పాఠ్య పుస్తకాలను కూడా జూలై నెలలో పంపిణీ చేసేందుకు ప్రభుత్వం అన్ని చర్యలూ చేపట్టింది.

చూడచక్కగా..



ఈ ఏడాది పాఠ్య పుస్తకాలు, వర్క్‌బుక్స్‌ను నూరు శాతం పాఠశాలలకు సకాలంలో చేరవేశాం. పాఠ్య పుస్తకాలు విద్యార్థులను ఆకట్టుకునేలా, నాణ్యమైన పేపరుతో ముద్రించారు. అక్షరాలు స్పష్టంగా, అర్థమయ్యేలా ఉన్నాయి. చూడచక్కగా ఉన్న పాఠ్య పుస్తకాలు విద్యార్థులను ఆకట్టుకుంటున్నాయి.

– జి.నాగమణి, ఆర్‌జేడీ, పాఠశాల విద్యాశాఖ, కాకినాడ

లారీ ఢీకొని వ్యక్తి మృతి

కాకినాడ రూరల్: పోర్టు రోడ్డులో లారీ ఢీకొని గురజనాపల్లికి చెందిన ఆకుల సునీల్‌కుమార్ (38) మృతి చెందాడు. సర్పవరం పోలీసుల కథనం ప్రకారం.. పోర్టు నుంచి సూర్యారావుపేట లైట్ హౌస్ వైపు ఆదివారం రాత్రి వేగంగా వెళ్తున్న లారీ కోరమండల్ జంక్షన్ వద్ద మోటార్ సైకిల్‌పై వెళ్తున్న సునీల్‌ను ఢీకొంది. దీంతో సునీల్ మృతి చెందాడు. ప్రైవేటు కంపెనీలో పని చేస్తున్న అతడు కోరమండల్‌లోకి వెళ్తుండగా ప్రమాదం జరిగింది. మృతుడికి భార్య, మూడేళ్ల కుమార్తె ఉన్నారు.

డీసీఎంఎస్ మాజీ చైర్మన్ రెడ్డి గోవిందరావు మృతి



రెడ్డి గోవిందరావు (ఫైల్)

కాకినాడ/ఆలమూరు: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కో ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) మాజీ చైర్మన్ రెడ్డి గోవిందరావు (83) సోమవారం మృతి చెందారు. కొద్ది రోజులుగా అస్వస్థతతో ఉన్న ఆయన ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం గుమ్మిలేరుకు చెందిన ఆయన 1995 నుంచి 2004 వరకూ రెండు పర్యాయాలు డీసీఎంఎస్ చైర్మన్‌గా సేవలందించారు. గుమ్మిలేరు సర్పంచ్‌గా, జిల్లా సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షునిగా కూడా అనేక పదవులను సమర్థవంతంగా నిర్వహించారు. ప్రస్తుతం రాజకీయాలకు దూరంగా ఉంటూ సామాజిక సేవా కార్యక్రమాల్లో కొనసాగుతున్నారు. గుమ్మిలేరు పరిసర ప్రాంతాల్లో పేద వర్గాల అభ్యున్నతికి అనేక సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించారు. కాకినాడలోని హిందూ శ్మశానవాటికలో గోవిందరావు అంత్యక్రియలు నిర్వహించారు. ఆయన మృతికి పలువురు రాజకీయ, నగర ప్రముఖులు తీవ్ర సంతాపం తెలిపారు. గోవిందరావు మృతితో గుమ్మిలేరులో విషాద ఛాయలు అలముకున్నాయి.

ఎంపీ గీత సంతాపం

డీసీఎంఎస్ మాజీ చైర్మన్ గోవిందరావు మృతి పట్ల కాకినాడ ఎంపీ వంగా గీత ప్రగాఢ సంతాపం తెలిపారు. కాకినాడలోని ఆయన కుటుంబ సభ్యులను కలిసి సానుభూతి తెలిపి, ఓదార్చారు. తాను జెడ్పీ చైర్మన్‌గా ఉన్న సమయంలో రెడ్డి గోవిందరావుతో కలిసి పని చేశానని, ఆయన సామాజిక దృక్పథం కలిగిన సమర్థవంతుడైన నాయకుడని అన్నారు. డీసీఎంఎస్ చైర్మన్‌గా సుదీర్ఘ కాలం పని చేసిన ఆయన అనేక గోడౌన్ల నిర్మాణంతో పాటు అభివృద్ధిలో తనదైన ముద్ర వేసుకున్నారని గుర్తు చేసుకున్నారు.


కడుపు నొప్పి తాళలేక ఆత్మహత్య

సీతానగరం: కడుపు నొప్పి తాళలేక ఓ వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏఎస్సై సమర్పణరావు కథనం ప్రకారం.. పురుషోత్తపట్నానికి చెందిన మాసిన రామకృష్ణ (70) రెండేళ్ల నుంచి అనారోగ్యంతో బాధ పడుతూ మందులు వాడుతున్నాడు. రాత్రి వేళల్లో నిద్ర పట్టక ఇబ్బందులు పడుతున్నాడు. ఈ నేపథ్యంలో రామకృష్ణకు సోమవారం ఉదయం కడుపు నొప్పి రావడంతో తట్టుకోలేకపోయాడు. వైద్యుని వద్దకు తీసుకువెళ్తానని కుమారుడు రాజశేఖర్ చెప్పినా తిరస్కరించి, పొలంలోకి వెళ్తానని చెప్పాడు. అనంతరం పొలం వద్ద ఉన్న పశువుల షెడ్డులో దూలానికి తాడుతో ఉరి వేసుకుని రామకృష్ణ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతడికి భార్య, ఇద్దరు కుమారులు చిట్టిబాబు, రాజశేఖర్ ఉన్నారు. రాజశేఖర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హత్య కేసులో జీవిత ఖైదు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): సొంత పెద్దమ్మను హత్య చేసిన సంఘటనలో నిందితుడు దేవాదుల నాగేశ్వరరావుకు జీవిత ఖైదు విధిస్తూ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి జి.సునీత సోమవారం తీర్పు ఇచ్చారు. వివరాలివీ.. ప్రకాశ్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని లాలాచెరువు స్పిన్నింగ్ మిల్లు కాలనీలో దేవాదుల శ్యామల ఒంటరిగా నివాసం ఉండేది. ఇన్నీసుపేటకు చెందిన దేవాదుల నాగేశ్వరరావుకు ఆమె పెద్దమ్మ అవుతుంది. అతడు ఏ పనీ చేయకుండా మద్యం తాగుతూ, తిరుగుతూండేవాడు. నాగేశ్వరరావు 2018 నవంబర్ 14న పెద్దమ్మ శ్యామల ఇంటికి వెళ్లాడు. ఆమె టీ కాచేందుకు వెళ్లగా, అదే సమయంలో రొట్టెల కర్రతో తలపై బాది, పీక నొక్కి హత్య చేశాడు. ఆమె చేతులకున్న 10 గ్రాముల బంగారు గాజులు, నాంతాడు, నల్లపూసల గొలుసు, బంగారు పగడాల గొలుసు కలిపి మొత్తం 33 కాసుల బంగారం దొంగిలించి పారిపోయాడు. దీనిపై హతురాలి కుమారుడు వెంకట రంగాకుమార్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అప్పటి సీఐ ఎస్‌కే బాజీలాల్ కేసు నమోదు చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్‌వీ ధర్మారావు ప్రాసిక్యూషన్ నిర్వహించారు. సాక్షులను కోర్టుకు హాజరు పరచి, నేర నిరూపణకు సీఐ పీఈ పవన్‌కుమార్‌రెడ్డి, కోర్టు హెడ్ కానిస్టేబుల్ పి.కొండలరావు కృషి చేశారు. విచారణలో నాగేశ్వరరావుపై నేరం రుజువైంది.

విద్యుత్ శంఖుచక్ర నామాలకు టెండర్ ఖరారు!



రత్నగిరిపై ఏర్పాటు చేయనున్న విద్యుత్ శంఖుచక్ర నామాల నమూనా

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని సన్నిధిలో విద్యుత్ దీపాలతో ఏర్పాటు చేయతలపెట్టిన శంఖుచక్ర నామాలకు టెండర్ దాదాపుగా ఖరారైంది. వీటిని న్యూ సీసీ సత్రం మీద ఏర్పాటు చేసేందుకు రూ.34.78 లక్షల అంచనాతో ఈ–ప్రొక్యూర్‌మెంట్ ద్వారా పిలిచిన టెండర్లను సోమవారం తెరిచారు. మొత్తం రెండు టెండర్లు దాఖలయ్యాయి. వీటిలో శ్రీ శ్రావణి ఇండస్ట్రీస్ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ సంస్థ 5 శాతం ఎక్కువగా రూ.36.52 లక్షలకు, విజయం ఇన్‌ఫ్రా డెవలపర్స్ సంస్థ 18.77 శాతం తక్కువగా రూ.28.25 లక్షలకు టెండర్లు దాఖలు చేశాయి. తక్కువగా ఉన్న విజయం ఇన్‌ఫ్రా టెండర్‌ను ఆమోదించాలని కోరుతూ దేవదాయ శాఖ కమిషనర్‌కు ఫైలు పంపించామని అన్నవరం దేవస్థానం ఈఓ ఎస్ఎస్ చంద్రశేఖర్ అజాద్ సోమవారం విలేకర్లకు తెలిపారు. దేవస్థానంలోని న్యూ సీసీ సత్రంలో ఇప్పటికే 42 అడుగుల ఎత్తున విద్యుత్ నామం భక్తులను అలరిస్తోంది. అయితే ఒకే ఎత్తులో శంఖుచక్ర నామాలను ఇనుప గొట్టాలతో తయారు చేసి, వాటికి రేకులు అమర్చే పనికి టెండర్ పిలిచారు. వీటి ఏర్పాటుకు మరో రూ.36 లక్షలు ఖర్చవుతుందని ఈఓ తెలిపారు. జాతీయ రహదారి పైన, రైళ్లలోను ప్రయాణించే వారికి కూడా ఈ శంఖుచక్ర నామాలు స్పష్టంగా కనిపించేలా ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. తాజా అంచనాల ప్రకారం శంఖుచక్ర నామాలు 48 అడుగుల ఎత్తున ఉంటాయన్నారు. ఉప ముఖ్యమంత్రి, దేవదాయ, ధర్మదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ఆదేశాల మేరకు వీటిని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రెండు నెలల్లో వీటిని ఏర్పాటు చేయాలని భావిస్తున్నామని ఈఓ చెప్పారు.

అర్జీదారుల సంతృప్తే లక్ష్యం కావాలి

- ప్రభుత్వ ప్రాధాన్య అంశాలపై మరింతగా దృష్టి పెట్టాలి
- కలెక్టర్ హిమాన్షు శుక్లా
- స్పందనలో 200 అర్జీల స్వీకరణ



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ శుక్లా, జేసీ ధ్యానచంద్ర, డీఆర్‌ఓ సత్తిబాబు

అమలాపురం రూరల్: అర్జీదారుల సంతృప్తే లక్ష్యంగా వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ సిబ్బంది జవాబుదారీతనంతో పని చేయాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జాయింట్ కలెక్టర్ హెచ్‌ఎం ధ్యానచంద్ర, జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబులతో కలిసి ప్రజల నుంచి 200 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం స్పందన, జగనన్నకు చెబుదాం, జగనన్న సురక్ష కార్యక్రమాలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోందని అన్నారు.

ప్రభుత్వ ప్రాధాన్య అంశాలపై జిల్లా స్థాయి అధికారులు మరింతగా దృష్టి సారించాలని, ప్రభుత్వ ఆశయాలను సాకారం చేసే దిశగా అంకితభావంతో పని చేయాలని సూచించారు. స్పందన యాప్‌లో అర్జీలపై విచారణ స్థాయిలో తీసిన ఫొటోలను, విచారణ నివేదికలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తూ తిరిగి వచ్చే ఆస్కారం లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. గడువు దాటిన అర్జీలు లేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పోలీసు స్పందనకు 35 అర్జీలు

అమలాపురం టౌన్: జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమానికి 35 అర్జీలు వచ్చాయి. ఎస్పీ సుసరాపు శ్రీధర్ ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో ఎక్కువ మంది వ్యక్తిగత, ఆస్తి, కుటుంబ వివాదాలపై ఫిర్యాదు చేశారు. కొన్నింటిని ఎస్పీ అక్కడికక్కడే పరిష్కరిస్తూ ఆయా పోలీసు స్టేషన్ల అధికారులతో ఫోనులో మాట్లాడి చర్యలు చేపట్టారు. అమలాపురం రూరల్ పేరూరులో స్త్రీనిధి సొమ్ములు రూ.70 లక్షల వరకూ గోల్‌మాల్ అయ్యాయని డ్వాక్రా మహిళలు మూకుమ్మడిగా వచ్చి ఎస్పీకి ఫిర్యాదు చేశారు. కూలీనాలీ చేసుకుని బతుకుతూ పొదుపు చేసుకున్న సొమ్ములను దుర్వినియోగం చేశారని వాపోయారు. దీనిపై సమగ్ర దర్యాప్తు చేయించి దోషులను గుర్తించి, తమ సొమ్ములు ఇప్పించాలని విన్నవించుకున్నారు. స్పందన కార్యక్రమంలో ఎస్పీ కార్యాలయం స్పెషల్ బ్రాంచి సీఐ కోలా రజనీకుమార్, డీసీఆర్‌బీ ఎస్సై గంగాభవాని కూడా పాల్గొన్నారు.

పది రోజుల్లో పూర్తి స్థాయి కమిటీలు

- వైఎస్సార్ సీపీ యువజన విభాగం నేత జక్కంపూడి గణేష్
- త్వరలో 'జయహో జగనన్న' సమావేశాలు



సమావేశంలో మాట్లాడుతున్న జక్కంపూడి గణేష్

రాజమహేంద్రవరం సిటీ: యువజన విభాగాన్ని బలోపేతం చేసేందుకు అవసరమైన కమిటీలను పది రోజుల్లో నియమిస్తామని వైఎస్సార్ సీపీ యువజన విభాగం ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ తెలిపారు. రీజియన్ పరిధిలోని యువజన విభాగం పార్లమెంటరీ జిల్లాల అధ్యక్షులు, రాష్ట్ర కమిటీ సభ్యులతో రాజమహేంద్రవరంలోని తన కార్యాలయంలో జిల్లా, మండల యువజన విభాగం కమిటీలపై ఆయన సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కమిటీల నియామకం అనంతరం యువజన విభాగం ఆధ్వర్యాన త్వరలో 'జయహో జగనన్న' పేరుతో ప్రతి జిల్లాలో సమావేశాలు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. యువజన విభాగం ఆధ్వర్యాన పలు సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తూర్పు, పశ్చిమ గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, ఏలూరు జిల్లాల యువజన విభాగం అధ్యక్షులు చొటుపల్లి వీరన్న, కుంచలాపల్లి విన్‌స్టన్‌బాబు, సూరిశెట్టి బాబి, పడమటి గిరిబాబు, ఉభయ గోదావరి జిల్లాల యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజు, ప్రధాన కార్యదర్శి కందుల దినేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీపెట్ డిప్లమో కోర్సుల ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

అమలాపురం రూరల్: విజయవాడలోని భారత ప్రభుత్వ సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజినీరింగ్ – టెక్నాలజీ(సీఐపీఈటీ – సీపెట్)లో డిప్లమో కోర్సులలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. సీపెట్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ చింతా శేఖర్ సోమవారం ఈ విషయం తెలిపారు. మూడు, రెండు సంవత్సరాల వ్యవధితో డిప్లొమా, పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ టెక్నాలజీ (డీపీటీ), డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ మౌల్డ్ టెక్నాలజీ (డీపీఎంటీ) కోర్సులకు 10వ తరగతి చదివిన వారు అర్హులని వివరించారు. పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ ప్రాసెసింగ్ అండ్ టెస్టింగ్ (పీజీడీ– పీపీటీ) కోర్సుకు బీఎస్సీ చదివి ఉండాలని తెలిపారు. అర్హులైన విద్యార్థులకు ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ సదుపాయం, విద్యార్థినీ విద్యార్థులకు విడివిడిగా హాస్టల్ సదుపాయం ఉన్నాయని పేర్కొన్నారు. ఇప్పటికే నిర్వహించిన సీపెట్ కామన్ అడ్మిషన్ టెస్ట్ ఫలితాలు వెలువడినప్పటికీ, ఏపీ 10వ తరగతి సప్లిమెంటరీ విద్యార్థుల విజ్ఞప్తి మేరకు వారికి రెండో విడత ప్రవేశ పరీక్ష నిర్వహించి, బీఎస్సీ అభ్యర్థులకు తుది అవకాశం కల్పిస్తున్నామని వివరించారు. ఆసక్తి ఉన్న వారు బి.అంజినాయక్‌ను 78935 86494, కొల్లు రమణ ఫౌండేషన్ ఆర్గనైజర్ కొల్లు ఆనంద్‌ను 99488 77339 నంబర్లలో సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని శేఖర్ సూచించారు.

వివాహిత ఆత్మహత్య

ముమ్మిడివరం: భర్తతో తగవు నేపథ్యంలో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై కె.సురేష్‌బాబు సోమవారం తెలిపిన వివరాల ప్రకారం.. ముమ్మిడివరం మండలం కర్రివానిరేవు పంచాయతీ పరిధి చింతావానిరేవుకు చెందిన మల్లాడి నాగజ్యోతి(19)కి రెండున్నరేళ్ల కిందట మధుకుమార్‌తో వివాహం జరిగింది. వారికి 18 నెలల కుమారుడు ఉన్నాడు. భార్యాభర్తలిద్దరూ తరచూ తగవులు పడేవారు. భర్తను ఆదివారం ఇంటి నుంచి బయటకు వెళ్లవద్దని నాగజ్యోతి చెప్పింది. అయినప్పటికీ అతడు వెళ్లిపోవడంతో మనస్తాపం చెందిన నాగజ్యోతి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది.